శైవక్షేత్రాల వద్ద ఆధ్యాత్మిక సందడి



చిలకలగూడ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చిలకలగూడ: కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా చిలకలగూడలోని పలు శైవక్షేత్రాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేకువజాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగలింగేశ్వర స్వామికి ఆలయ ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్టుగూడ డివిజన్ దాతర్‌కాంపౌండ్‌లోని శివాలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

దేవాలయాల వద్ద నిఘా పెంచాలి



ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వివిధ దేవాలయాల కమిటీ సభ్యులు

అడ్డగుట్ట: రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో అడ్డగుట్టలోని దేవాలయాల వద్ద నిఘా పెంచాలని హనుమాన్ భక్తి సేవాసమితి, తుకారాంగేట్‌లోని వివిధ ఆలయాల కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజేవైఎం డివిజన్ అధ్యక్షుడు గెల్లు ఉదయ్‌యాదవ్ మాట్లాడుతూ ఒక పక్క హిందూ దేవాలయపై దాడులు జరుగుతుంటే అందుకు నిరసనగా కార్యక్రమాలు చేసిన ధర్మ రక్షకులపై ప్రభుత్వ అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. రాగుల రాజు, నర్సింగ్, విజయ్‌కుమార్, శివాజీ, చింటూ, సంతోష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



విజేతలతో ప్రొ.జితేందర్ నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాల అథ్లెటిక్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 9, 10 తేదీలలో యూనివర్సిటీ అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్‌లో జరిగిన పోటీలలో బాల, బాలికల విభాగాలలో హైజంప్, లాంగ్ జంప్, జావలిన్ త్రో, హెమ్మర్ త్రో, రన్నింగ్ తదితర అథ్లెటిక్ క్రీడలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెల్లడించారు.

ఆలయాల భద్రతపై నిర్లక్ష్యం వహించవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సుబ్బయ్య

రాంగోపాల్‌పేట్: ఆలయాల భద్రత విషయంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహించవద్దని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య సూచించారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయ ఘటన దృష్టిలో ఉంచుకుని రెజిమెంటల్‌బజార్‌లోని సప్తగిరి హోటల్‌లో దేవాలయాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల వద్ద పోలీసుల పర్యవేక్షణ నిరంతరం ఉంటుందని కానీ నిర్వాహకులు కూడా తమ వంతుగా భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు, సెక్యూరిటీని ఏర్పాటుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాలపురం, మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్లు నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో నగర్ కీర్తన్

సిక్కుల మొట్టమొదటి మత గురువైన గురునానక్ దేవ్‌జీ 555వ జయంత్యుత్సవాల్లో భాగంగా నగర్ కీర్తన్ అత్యంత భక్తిశ్రద్ధలతో సిక్కు సోదరులు జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం సికింద్రాబాద్ గురుద్వారా నుంచి ఈ నగర్ కీర్తన్ కార్యక్రమం మొదలైంది. సిక్కుల మత గ్రంథమైన గురు గ్రంథ్‌ను అందంగా అలంకరించిన వాహనంలో ఉంచి సిక్కుల మతాన్ని ప్రతిబింబించే జెండాలను చేతపట్టుకుని భక్తి గీతాలు పాడుతూ వేలాది మంది సిక్కు సోదరులు, సోదరీమణులు పవిత్ర ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్ అశోక్‌నగర్‌కు చెందిన సిక్కు ప్రముఖులు బల్దేవ్‌సింగ్ బగ్గా, సత్విందర్ సింగ్ బగ్గా, జగన్మోహన్‌సింగ్, హర్‌ప్రీత్ సింగ్ గులాటీ తదితరులు పాల్గొన్నారు. దారి వెంట పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు బస్తు నిర్వహించారు.

రాంగోపాల్‌పేట్:







నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: జమిస్తాన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 12వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీఆర్ అపార్ట్‌మెంట్, ఎల్లమ్మ దేవాలయం, స్కంధగిరి, బ్రూక్‌బాండ్ కాలనీ, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎంసీహెచ్ పార్కు ఫీడర్ పరిధిలోని బలరాంకాంపౌండ్, సంధ్య హోటల్, హెరిటేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సనత్‌నగర్: బేగంపేట్, ఆల్విన్, మోతీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాపునగర్, ఎస్సార్‌నగర్ మెయిన్‌రోడ్డు, లోయర్ వాటర్ వర్క్స్, 2ఆర్‌టీ క్వార్టర్స్, పీఆర్‌నగర్, అవంతినగర్ ఈస్ట్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రేంనగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎస్సార్‌నగర్ శ్రీవెంకటేశ్వరస్వామి టెంపుల్ లేన్, బీ-టైప్ క్వార్టర్స్, 3ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్సార్‌నగర్ కమ్యూనిటీ హాల్ మెయిన్‌రోడ్డు, గౌతమి ధామం స్కూల్ ఏరియా, ఓల్డ్ రిలయన్స్ ఫ్రెష్, జ్ఞాన సరస్వతి స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో...) టమాటా 23, నల్లవంకాయ 55, పొడుగు వంకాయ 35, బెండకాయ 55, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 32 పందిరి బీర 42, క్యాబేజీ 35, క్యారెట్ 70, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 70, గోకర కాయ 40, కీర 15, దోసకాయ 35, బీట్‌రూట్ 55, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 60, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6.

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే పింఛనుదారుల సంఘ జాతీయ అధ్యక్షుడు రాఘవరావు

చిలకలగూడ: కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేకుంటే లక్షలాది మంది కార్మికులు సంఘటితమై డిమాండ్ల సాధనకు శాంతియుత ఆందోళన చేపడతామని రైల్వే పింఛనుదారుల జాతీయ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాఘవరావు అన్నారు. చిలకలగూడ రైల్వే సంఘ్ కార్యాలయంలో రైల్వేపింఛనుదారుల సంఘ అనుబంధ వర్క్‌షాపు డివిజన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్‌వీఎస్ రాఘవరావు మాట్లాడుతు 18 నెలల డీఏ, డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంయుక్త పార్లమెంటరీ కమిటీ సిఫార్స్ చేసిన పింఛను పెంపుదల, రూ.3వేల మెడికల్ అలవెన్స్, రద్దు చేసిన సీనియర్ సిటిజన్స్ రైల్వే రాయితీలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజేందర్, జైపాల్, నారాయణ, విద్యాసాగర్, మోజెస్‌లతో పాటు సభ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

తుపాకీ బుల్లెట్ కంటే ఓటే ప్రధానం

• కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అమీర్‌పేట: తుపాకీ బుల్లెట్ కంటే ఓటు బుల్లెట్టే ప్రధానమని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అనే వారని,అదే విధంగా సమాజంలో మార్పు రావాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు.సోమవారం అమీర్‌పేట ఏషియన్ సత్యం థియేటర్‌లో జితేందర్‌రెడ్డి సినిమా వీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత నాయకుడు జితేందర్‌రెడ్డి దండ్రి మల్లారెడ్డి కరడుగట్టిన జాతీయవాదని,వారి కుటుంబమంతా గొప్ప జాతీయ భావజాలంతో పనిచేశారని తెలిపారు.రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి అనేక రకాల బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. దర్శకుడు విరంచి చిత్రాన్ని అద్భుతంగా మలిచి ప్రేక్షకుల ముందుకు తీసుకుని వచ్చారని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంట హీరో రాకేష్‌వర్మ,బిజెపి నాయకులు ఉన్నారు.



జితేందర్‌రెడ్డి సినిమా చూస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పొదుపు చేయించడమే లక్ష్యం



ఫినోబ్యాంక్ గుల్లక్ సేవింగ్స్ ఖాతా వివరాలు వెల్లడిస్తున్న మహ్మద్ ఇనాయతుల్లా తదితరులు

రసూల్‌పురా: ఖాతాదారులతో పొదుపు చేయించడమే లక్ష్యంగా సేవింగ్ అకౌంట్ గుల్లక్ (పిగ్గిబ్యాంక్) ప్రారంభించినట్లు ఫినో పేమెంట్ బ్యాంక్ జోనల్ హెడ్ మహ్మద్ ఇనాయతుల్లా పేర్కొన్నారు. బాలంరాయి ఇండియన్ ఎయిర్ లైన్స్ కాలనీ బ్యాంకు శాఖలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు తమ సేవింగ్స్‌ను ఆదా చేయడంపై దృష్టి సారించేలా బ్యాంకింగ్ ప్రక్రియను సులువుగా సరళంగా సౌకర్యవంతంగా మార్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఖుద్దూస్, రిజనల్ హెడ్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డీవీకాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. సోమవారం ఆమె డీవీకాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను డీఈ మహేష్, జలమండలి మేనేజర్ రామేశ్వర్‌లతో కలిసి ఆమె పరిశీలించారు. మార్చిలో ప్రారంభించిన శంఖుస్థాపనలు చేసిన పనులు ఇంత జాప్యం కావడానికి కారణం ఏంటని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ సెల్ నాయకులు చీర శ్రీకాంత్, నాయకులు మదన్, నమన్, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నాం

• ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి.సనత్‌నగర్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ బండమైసమ్మనగర్ మురికివాడలో రూ. 71లక్షల వ్యయంతో వేస్తున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలు సూచించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, ఏసీపీ సుష్మిత, ఏడీఈ దుర్గాప్రసాద్, డీజీఎం ఆశీష్, స్థానిక నాయకులు లక్ష్మీపతి, వెంకటేషన్, ఫయూమ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం అస్తవ్యస్తం

బన్సీలాల్‌పేట్‌లో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ఆయన సందర్శించి అక్కడ నెలకొన్న అపరిశుభ్రమైన వాతావరణం మరుగుదొడ్ల నుంచి వెలువడుతున్న దుర్వాసనపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

కఠినమైన చట్టాలతోనే నేరాలకు అడ్డుకట్ట

• ఎమ్మెల్యే శ్రీగణేష్



ముత్యాలమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: దేవాలయాలపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, గోవులపై దాడుల లాంటి ఘటనలకు పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు అమలు చేసేందుకు చట్టాలను మార్చాల్సిన అవసరం ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించి స్థానికులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో ఉండే బీజేపీ ఇప్పుడు ఉంటే చట్టాలను మార్చి కఠినమైన చట్టాలను తీసుకుని వస్తే ముత్యాలమ్మ దేవాలయంపై జరిగిన దాడి లాంటి ఘటనలను పాల్పడే వారికి భయం ఉంటుందన్నారు. ముత్యామ్మ దేవాలయ ఘటన ఎంతో మంది హిందువులను మనసులను గాయపరిచిందని అయితే ప్రభుత్వం వెంటనే స్పందించి దేవాలయ రూపరేఖలు మార్చి అత్యంత సుందరంగా తీర్చిదిద్దే పనులను మొదలు పెట్టిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్రినాథ్ యాదవ్, నందికంటి రవి, సంతోష్ యాదవ్, సంకి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.70 కోట్లతో మోండా డివిజన్ అభివృద్ధి: ఎమ్మెల్యే శ్రీగణేష్

మోండా డివిజన్‌లో రూ.2.70 కోట్ల వ్యవయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జడ్సీ రవికిరణ్‌ను కలిసి డివిజన్‌లో చేపట్టాల్సిన రోడ్లు, స్ట్రామ్ వాటర్ తదితర అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

సంక్షిప్త వార్తలు

◆ **పవర్ బోర్ పనులు ప్రారంభం**

బౌద్ధనగర్: అశోక్ నగర్‌లోని పోచమ్మ దేవాలయం కమాన్ వద్ద నూతనంగా పవర్‌బోర్ పనులను కార్పొరేటర్ కంది శైలజ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్, కంది నారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

◆ **పచ్చదనం పెంపొందించాలి**

లాలాపేట: జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమీషనర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐఎఫ్‌ఎస్ అధికారిణి వీవీ ఎల్. సుభద్రాదేవి సోమవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. మహానగరం సుందరీకణ, పచ్చదనం, పౌరులకు మెరుగైన సౌకర్యాలు తదితర సమస్యలపై చర్చించారు.

◆ **మాట తప్పిన మంత్రులు**

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రులు మాట తప్పారని ప్రైవేటు కాలేజీల యజమానులు ధ్వజమెత్తారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌ల కోసం గత నెల 14 నుంచి 19 వరకు కాలేజీలను మూసివేసి ఆందోళన చేపట్టగా వారం రోజుల్లోగా నిధులు విడుదల చేస్తామని మంత్రులు బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ హామి ఇచ్చినా ఇంత వరకు ఒక్క రూపాయికూడ ఇవ్వలేదన్నారు.

◆ **నర్సింగ్ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం**

బన్సీలాల్‌పేట: నర్సింగ్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. సోమవారం బన్సీలాల్‌పేట డివిజన్ బోయగూడలో గల గాంధీ ఆసుపత్రి అనుబంధ ప్రభుత్వ నర్సింగ్ కాలేజీని తలసాని సందర్శించారు. హాస్టల్లో ఉంటున్న విద్యార్థుల సంఖ్య, అక్కడి సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

◆ **చారకొండ వెంకటేష్‌కు పలువురి అభినందన**

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర విద్యా కమీషన్ మెంబర్ డా.చారకొండ వెంకటేష్‌కు ఓయూ విద్యార్థి నేతలు అభినందనలు తెలిపారు. సోమవారం విద్యార్థి నేత వలిగొండ నరసింహ నేతృత్వంలో చారకొండను కలసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ **ఓయూలో వసతులు కల్పించండి**

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మెరుగైన వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. హాస్టల్స్, మెస్సులు, లైబ్రరీ, హెల్త్ సెంటర్లు తదితర ప్రాంతాలలో విద్యార్థులకు కావలసిన వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.

◆ **ఓయూలో సదర్ సమ్మేళనం**

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సదర్ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథులుగా అరవింద్ కుమార్‌యాదవ్, వెంకటస్వామి, జూబ్లీహిల్స్ నవీన్ యాదవ్, నక్క శ్రీశైలంయాదవ్, బొల్లు నాగరాజుయాదవ్, తుమ్ నవీన్‌యాదవ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయండి**

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఇంజినీరింగ్ విద్యార్థులకు కొనసాగుతున్న డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డికి డిటెన్షన్ రద్దు చేయాలని వినతి పత్రం సమర్పించారు.

సాంస్కృతిక వైభవాన్ని పెంపొందిస్తున్న కేంద్రీయ విద్యాలయాలు

• కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

రసూల్‌పురా: ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా కేంద్రీయ విద్యాలయ పాఠశాలలు విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మక, కళలు వెలికి తీస్తూ రాష్ట్ర ఎక్తా పర్వ్ ద్వారా వైవిధ్యమైన దేశ సాంస్కృతిక వైభవాన్ని పెంపొందిస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో జరిగిన రాష్ట్రీయ ఏక్తా పర్వ్ కార్యక్రమాన్ని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేంద్రీయ విద్యాలయం ఒక శక్తివంతమైన మినీ ఇండియా లాంటిదన్నారు. భారత దేశపు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబింబంగా నిలుస్తుందని అన్ని ప్రాంతాల నుంచి వివిధ మాతృభాషల విద్యార్థులు ఇక్కడ చదువుకుంటారని అన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలు అన్ని సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్ నిధి పాండే, భారత ప్రభుత్వ పాఠశాల విద్య విభాగం కార్యదర్శి ఐఏఎస్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాంగోపాల్‌పేట్: హుస్సేన్ సాగర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సెక్రటరియేట్ పోలీసులు వెలికితీశారు. పోలీసుల కథనం ప్రకారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం ఎదురుగా హుస్సేన్ సాగర్ జలాల్లో గుర్తు తెలియని మృతదేహం తేలియాడుతుందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి వెలికితీశారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఒంటిపై క్రీమ్ కలర్ చెక్స్ చొక్కా, నలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని గుర్తింపు నిమిత్తం గాంధీ మార్చురీలో భద్రపరిచారు. సంబంధీకులు ఉంటే సెక్రటరియేట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.